# దైవోపహతుడు

**టకటక...** టక్‌టక్... తలుపు మీద గొళ్లెం గంతులు.

లబడబ... లబ్‌డబ్... నర్సవ్వ హృదయ కవాటాల ఊగిసలాట. బతికి చెడిన గతం అనుభవరేఖలు నుదుటిమీద వంకర్లు తిరిగిపోతున్నై... మల్లా ఏం ముంచుకొచ్చిందో... ఎవలొచ్చింగ్రో... ఏం కతనో... ప్రాణాలరచేతిలో కొచ్చినై.

"పద్మా... ఓ పద్మా ... !" గొంతులో వణుకు.

"ఏందమ్మా ?... ఏందే ?" వంటింట్లో నూకలు కడగడుతున్న పద్మ వోణీతో చేతులు తుడుచుకుంటూ బయటికొచ్చింది.

"... ఎవలో... త.. త... త్తలుపు కొడ్తున్నారు బిడ్డా ..." గొంతు వణుకు వెన్నుపూసలో దూరి వానపాములా కదిలింది.

గిప్పుడు, గీ మునిమాపుయాల్ల... చీకటి ముసుగుల ... ఎవలో ...ఎందుకొచ్చింగ్రో ! చెంపల మీదాడుతున్న ముంగురుల్ని సవరించుకుంటూ గతుక్కుమంది పద్మ. ఎందుకైనా మంచిదని ఎడమపక్క కిటికీ దగ్గరికెళ్లింది. చూపులు బయటకు పరుగులు దీసినై. ముసురుకోబోతున్న చీకట్లను తరిమేస్తూ ఆకాశం తెరమీద అప్పుడే అవతరించిన చందమామను మబ్బులు కమ్ముకుంటున్నై. చెట్ల మీది పక్షుల గడబిడ తగ్గుముఖం పడ్తోంది.

ఠక ఠక... ఠక్ ఠక్... మళ్లీ గొళ్లెం పిలుపు.

అన్న కోసం మల్లా పోలీసోల్లు వచ్చింగ్రేమో ! "అన్నల లీడర్ మీ అన్న ఎక్కడున్నడో చెప్పు"మని మల్లా లాఠీలతో కొడ్తారేమో ! "నీ కొడుకెక్కడున్నడే ముసలిముండా !" అని అమ్మ మోకాళ్లమీద కీళ్లమీద కొట్టి చంపుతరేమో !

ఊర్లె బస్సుకాల్చేసినప్పుడు, ఎక్కడనో బాంబులు పేలి పోలీసులు చచ్చినప్పుడు ఎర్రటోపీలు, తుపాకి మడమలు పెట్టిన బాధలు, నరకయాతన గుర్తుకొచ్చి నరాలు డీలా పడిపోయినై. ఏం చెయ్యాలో తోచలేదు. అంతా ఆగమాగం...

"అమ్మా... ఓ అమ్మా ! పద్మా... ఓ పద్మా !" తలుపు సందులోంచి సన్నని పిలుపు. ఎప్పుడిదా పిలుపు ! ఎన్నాళ్లకిందిదా పిలుపు !... నేరుగా గుండె తలుపుల్ని తట్టింది.

ఘల్లు ఘల్లు... ఘల్ ఘల్... పద్మ పాదమంజీరనాదాలు.

కిర్ర్...ర్ర్ర్... తలుపులు తెరుచుకున్నై.

"ఆఁ... అన్నా... కొండన్నా !" పద్మ మొహం అరవిరిసిన పారిజాతమైంది. అరచేతు లంతైన కళ్లల్లో... వెలుగు, ఆశ, ఆశ్చర్యం... "రా అన్నా ! ఆరేండ్ల కింద అడవులల్ల జేరినవు.

కాలేజిల చదువుకుంటనని కనబడకుండ వోతివి. దా అన్నా... దా !" చెయ్యి పట్టి లోపలికి తీసుకొచ్చింది.

"కొ... క్కొ .. కొడుకా !... కొండయ్యా !" నర్సవ్వ నవనాడుల్లో ఉత్సాహం ఉరుకులాడింది. "నా బంగారు కొండా !... బాగున్నావురా !" నుదుటి రేఖల నాట్య విలాసం. ఆనందం, ఆవేదన, ఆందోళన చెట్టాపట్టాలేసుకుని లోపలినుండి పొంగుకొస్తున్నై. "వచ్చినవా బిడ్డా !" కొడుకు గుండెల మీద వాలి గొల్లుమంది. గడ్డకట్టిన ఆవేదన కరిగినీరై కళ్లద్వారా బయటికొచ్చేస్తోంది. కొన్నేళ్ల అలసట అంతా అప్పుడే తీరిన అనుభూతి. వాకిట్లోంచి ఎవరెవరు వెల్తున్నారో, వస్తున్నారో పసికట్టజాలని పరిస్థితి... ఆనందం, అయోమయం.

"గిన్ని రోజులెక్కడున్నవో చెప్పుమని పోలీసోల్లు మా పానాలు దీస్తున్నరు. ఎక్కడేం గడ్బడైనా మనింటి కొచ్చిమమ్ముల్ని నలుపుకు తింటున్నరు బిడ్డా... మీ నాయిన సచ్చినా పీనుగును జూసె తందుకన్నా రాకపోతివి గదరా ... !" వెక్కుతోంది.

కన్నతల్లి ఒడి... గుడిలా .... హాయిగా ఉంది. కొండయ్య మనసులో కొత్త ఆలోచనలు రేపింది. వెంటనే కడుపులో కలకలం బయలుదేరింది.

"నా జాడ జెప్పుమని నాయనను పోలీసోల్లు ఎన్నిసార్లు కొట్టింండ్రో ! ఆఖరికి... మేము బాంబు వేసిన రైలు డబ్బాలనే నాయిన సచ్చిండని తెల్వంగనే నెత్తినోరు కొట్టుకున్ననమ్మా. అప్పుడిక్కడికి వచ్చిన, కాని మనింటి చుట్టూ పోలీసులున్నరు. అటెన్క కాష్టం కాడికొచ్చిన. అక్కడ గూడా తుపాకి పోలీసులే. నీ కన్నీళ్లు తుడువాలని, చెల్లెకు ధైర్యం చెప్పాలని వచ్చిన. కాని లాభం లేదు. నా కోసం... పోలీసులు ఉచ్చులు బిగించింండ్రు.... కన్నతండ్రి పాదాలకు మొక్కి నాలుగు కన్నీటిబొట్లతోని కడగలేకపోయిన. తలకొరివి పెట్టి ఋణందీర్చుకోలేక పోయిన్నమ్మా... " కొండల్ని ఢీకొనగలననుకున్న కొండయ్య పేగుల్లోంచి పెగులుకొచ్చిన ఆవేదన అల్లకల్లోలానికి గురిచేసింది. ఎన్నడూ కంటతడిపెట్టని మనసు కరిగి నీరైపోయింది. పద్మ కళ్లు ఊటచెలిమలై పోయినై.

"అన్నా ... !" ఆక్రందనలతో అన్న ఛాతీ మీద వాలిపోయింది. "మనం తండ్రిలేని పిల్లలమన్నా... గూట్లె పక్షులమైపోయినమ్మా... అమ్మా, నేను కూలినాలి చేస్కుంటున్నా, పోలీసులు ఎంటవడుతున్నరన్నా. నువ్వెక్కడున్నవో మాకేందెల్సు ? కాని... వాళ్లు మాత్రం మా ఈపులు సాపు జేస్తున్నరన్నా ... నీ జాడజెప్పుమని జబర్దస్తీ జేస్తున్నరన్నా...." ఎగదన్నుకొస్తున్న పొంగును అదిమిపెట్టి "గట్టెందుకు వోయినవన్నా ?" నిలదీసింది. వోణీతో అమ్మ, అన్న కళ్లు అద్ది తనకళ్లు తుడుచుకుంది. నర్సవ్వ గుండెల్లో గూడుకట్టుకున్న అనుమానాల మూట విప్పుకుందప్పుడే.

"పక్క ఊర్లె పాపయ్య దొరను నరికేసిన్నుడు, గా టెలిఫోనాఫీసు కాలిపోయినప్పుడు, జీబుమీద బాంబులు వడి పోలీసోల్లు సచ్చినప్పుడు... పోలీసోల్లు యమదూతలోలె వచ్చి మా

బొక్కలిరగ్గొట్టింన్రు బిడ్డా ! అప్పుడు నువ్వెక్కడున్నావ్‌రా ....?"

ఏకె 47 లతో, క్లైమోర్‌మైన్స్‌తో అధికారగణాలను గడగడ లాడించి బండబారిన కొండయ్య గుండె ఆత్మీయుల గుండెతడితో గుడగుడలాడింది. నర్సవ్వ కొడుకును కూచోబెట్టింది. తీక్షణ దృక్కులు అటూఇటూ సారిస్తూ "మరీ... గట్ల నక్సలైట్లల్ల జేరి మనుషుల్ని నరుకుతున్న వెందుకురా ? నీకేమన్నా పిచ్చివట్టిందా ?" అడిగేసింది.

"అవును. అది గూడా ఓ రకమైన పిచ్చే..." కొండయ్య ఆవేశం కోడెనాగులా బుసలు కొట్టింది. "సదూకున్నోళ్లకు ఉద్యోగాల్లేవు. భూస్వాములు పేదోళ్ల రక్తం పీలుస్తున్నరు. కాయకష్టం జేసుకుంటున్నోళ్లు భూమి కోసం, భుక్తి కోసం పూటకో గండంగా గడుపుతున్నరు. పొలాలను చెమటతో తడిపి ధాన్యం పండించిన పంటలకు ధరలు లేవు. బక్కరైతులు బజార్లవడి అడుక్కుతింటున్నరు. బంగ్లాలున్నోళ్లు మేడమీద మేడలు కడ్తున్నరు. ఆకలి చావులు రోజు రోజుకు పెరిగిపోతున్నై... వ్యవస్థ ఎందుకిట్లా తయారైంది ? దోస్తుల మాటలు వింటుంటే నా రక్తం సలసల కాగిపోయింది. చెడిపోయిన వ్యవస్తను తుపాకితో బాగు జెయ్యాలని అన్నలల్ల కలిసిపోయిన..." అంతరంగము అల్లకల్లోల సముద్రమైంది. "ఉద్యమాన్ని ఉధృతం చెయ్యాలని అడవులల్ల తిరిగిన. అజ్ఞాతముల గడిపిన. ఉపవాసాలున్నాను. తరుముకొస్తున్న పోలీసులనుంచి తప్పించుకుంటూ లీడర్‌నై పోయిన. క్యాడర్‌ను పెంచి పోషించిన..." లోపలినుండి బాధ ఎగదన్ను కొస్తోంది. దీపం వెలుగుతూనే ఉంది.

"కాని... ఇప్పుడేమైందో సూడన్నా. సర్కారోళ్లు నువ్వో విషపురుగు వంటున్నరు. నిన్ను దొరుకవట్టిచ్చినోల్లకు లక్షరూపాయలిస్తరట. గిదేందన్నా !" పద్మ మొహం ముకుళించుకు పోయింది.

"పద్మా ! ఇంగ మీరు బాధపడకుంన్రి." తనకుతానే ధైర్యమై చెల్లి తలనిమిరిండు. "అన్నల నడుమ ఉండి ఆగమై పోయిన. అమరేందర్ పేరుతో ఈ సమాజాన్ని ఆరేండ్లు హడలగొట్టించిన. గిన్ని తాగ్యాలుజేసి, గందర్ని చంపి... ఏం సాధించినానని ఒకసారి వెనుకకు తిరిగి చూసుకుంటే కడుపుల చల్లజేసినట్టైంది. నన్ను నేనే మోసం జేసుకుని కాళ్లూ చేతులు నరుక్కుంటున్నా నన్పించింది. గజదొంగోలె నాగరిక సమాజానికి దూరంగా ఇంకెన్నేండ్లు దాగుండాలె ? వ్యవస్థను మార్చేందుకిది దారి కాదని తెలిసింది. అడవి జంతువోలె గుట్టలల్ల, గుహలల్ల ఎంతకాలముండాలె ? ఇటు ఇంటికి కాకుండా, అటు సమాజానికి కాకుండా సర్వనాశనమై పోతున్నా. అసొంటి విప్లవమొక బూటకమని అర్థం జేసుకున్న. రేపు మీరే నన్ను పోలీసులకప్పజెప్పుంన్రి. ఆ లక్ష రూపాయలు మీరే తీసుకోంన్రి. హాయిగా బతుకుంన్రి..." ఎంత సముదాయించుకున్నా గొంతు వణుకుతూనే ఉంది.

"మరి... నీ సంగతన్నా ?"

"నేను లొంగిపోయినంక పోలీసోళ్లు నా మీద కేసు నడిపిస్తరు. ఆ కేసును గవర్నమెంటు మాఫీ జేస్తే సరే... లేక పోతే జైలుకు పొయ్యొస్తా. అటెన్క అందరోలె నేను కష్టంజేసుకుని బతుకుత..." అల్లకల్లోలమైన అంతరంగములో ఆరాటాల ఆటుపోట్లు. కట్టలు తెంచుకున్న వరదలా తోసుకొచ్చిన ఆవేదన గొంతులో నిక్షిప్తమైంది.

నూకల అన్నం తయారైంది. చాలా కాలం తర్వాత చెల్లితో పాటు తల్లి చేతి గోరుముద్దలు... స్వర్గంలో విహరిస్తూ అమృతం సేవిస్తున్నట్టుంది. ఇన్నాళ్లు తానేమి నష్టపోయాడో స్పష్టమై పోయింది.

"చేసిన పాపం చెప్పుకుంటే పోతుందంటరు గదమ్మా... !" తో ప్రారంభించి తన చేతుల్లో ఎవరెవరు హతమైంది, ఎక్కడెక్కడ బాంబులు వేసింది... పూసగుచ్చినట్టు చెప్పిండు. నెత్తిమీది నుంచి కొన్ని పుట్ల భారం దింపుకున్నట్టుంది. అర్ధరాత్రి దాటింది. బయట పండువెన్నెల, లోపల నిండు గుండెల నిజనిర్ధారణ.

.... రేపటితో నా గతానికి తెరపడి పోతుంది. అడవులల్ల ఉపవాసాల కంటే కొన్ని రోజులు జైలు కూడు... బాగానే ఉంటుంది. ఆ తర్వాత జన జీవన స్రవంతిలో కలిసిపోయి మారాజులాగుంటాను... చెల్లె పెండ్లి జేసి అమ్మను సుఖపెట్టాలె... కొండయ్యలోని కొండంత ఆశ హాయిగా నిద్రబుచ్చింది.

బాంబులమోత, భవనాల పేల్చివేత, భుస్వాముల ఆక్రందనలు, సామాన్యుల అంగలార్పులు... పచ్చని పల్లెల్లో చిచ్చు - కాల్పులు, ఎదురుకాల్పులు, ఎన్‌కౌంటర్లతో అగ్నిగుండమైన తెలంగాణాలో తెల్లవారలేదింకా. ఊరు గాఢనిద్రలో జోగుతోంది. పడమటి విడిదికి పున్నమి చంద్రుడు పరుగెడుతున్నాడు.

బుర్ర్‌ర్... బురుర్‌ర్... జీపు ఆగినట్లయింది.

పట్ పట్.. పట్ పట్ పట్.. పట్.. బూట్ల చప్పుడు.

దబ్ దబ్ .. దబాదబ్.. దబ్ దబ్ దబ్... పాత తలుపుల మీద కొత్త మోత..

"ఎవలూ... ఎవలూ.." దిగ్గున లేచి కూచుంది పద్మ తలుపు వైపు దృష్టి పోనిస్తూ.

దబ్బు... దబ్బు.. దబాదబ్.. దబాదబ్.. దభీ.. దభీ.. తుపాకి మొనల తాకిడికీ, బూట్ల కాళ్ల తన్నులకీ తలుపు రెక్కలు విరిగి పడిపోయాయి.

వెన్నెల భళ్లున లోపలికొచ్చి పద్మ మొహమ్మీద పడింది. కన్ను మూసి తెరిచేలోగా గన్నులతో మనుషులు తోసుకొచ్చారు లోపలికి.

"అరె.. ఎవలంటె... దొంగలా !..." పద్మ గుండెల్లో బాంబు పేలింది.

"అమ్మా !... అన్నా !.. " కెవ్వున కేకేసింది చెదిరిన బట్టల్ని సవరించుకుంటూ.

"ఏందే పద్దీ... ఏమైం..." కళ్లు తెరుస్తూన్న నర్సమ్మ నోరలాగే ఆగిపోయింది.

బిలబిలమంటూ తుపాకి పోలీసులు చుట్టుముట్టారు.

"కొండా... లెవ్వురా... లే.." వెన్నుపూసలోని వణుకునాపుకుంటూ పక్క మంచంమీద పడుకున్న కొడుకు బుజం తట్టింది.

"ఏందే.. తెల్లారిందా ?.." కళ్లు తెరుస్తూ ఆవలించబోయాడు కొండయ్య. చుట్టూరా సాయుధ పోలీసులు.

ఎందర్నో వలవేసి మట్టుపెట్టిన తాను పోలీసువలలో చిక్కిపోయాడు. మళ్లీ తీవ్రవాదం వైపు తలెత్తి చూడగూడదనుకున్న నిర్ణయం తనని నిరాయుధుడిగా పట్టిచ్చింది.

దగ్గర్లో ఉన్న గుడ్డిదీపం వెలుగుకి వెన్నెల మెరుగుపెడుతోంది.

"హమ్మయ్య... ఇవ్వాళ్టికి దొరికిపొయ్యావురా కొండయ్యా ఎలియాస్ అమరేంద్రా !.." గమ్మత్తుగా నవ్వాడు ఎస్పీ. దయాదాక్షిణ్యాలు, కరుణాకార్పణ్యాలకతీతమైన గ్రేహౌండ్స్ ఎస్పీ నవ్వది. కొండయ్యకి తెలుసు.

"ఏందీ ! మీరంతా ఎందుకొచ్చింన్రయ్యా ? తెల్లారినంక నా కొడుకే.." గుండెలు బిగబట్టుకుని చెప్పబోయింది నర్సమ్మ.

"నీ కొడుకేనే ముసల్దానా ! నక్సలైట్ లీడర్‌గదూ ! మా పోలీసోళ్లని పొట్టన వెట్టుకున్నడు. అమాయకుల్ని చంపేశిండు. బాంబులేసి బిల్డింగులు కూలగొట్టిండు... ఇయన్నీ మాకు దెల్వదా?.. లేరా... లే..." పళ్లు పలుగురాళ్లు నమిలాయి.

"అదిగాద్సార్.. నేనే వచ్చి లొంగిపోదామనుకున్నా సార్ !.." కొండయ్య లేచి నుంచుని చేతులు జోడించాడు.

"గా డ్రామాలె నడవ్వ నాదగ్గర ... పద నాయనా..." వెకిలినవ్వుకి తోడు లాఠీ గాల్లోకి లేచింది.

"సారూ... మా అన్న మంచోడైండు..." ధైర్యం పుంజుకుని చెప్పబోతున్న పద్మ చెంప ఛెళ్లుమంది. "నీయవ్వ !... నీ అన్నగాని సంగతి మాకు దెల్వదాయె పోరీ ! లొంగిపోతనని లంజనాటకమాడి లపుక్కున తప్పించుకోవాలని గదూ ! నీ యేషాలన్నీ మా ముంగటనాయే.." హెడ్ కానిస్టేబుల్ వెక్కిరింత.

ఇద్దరు కానిస్టేబుళ్లు కొండయ్య జబ్బలందుకున్నారు.

"నేన్నిజంగా సరెండర్..." అనబోతున్న కొండయ్య గూబ గుయ్యిమంది.

పోలీస్‌ఫోర్స్‌ని ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్లు తాగించిన దళనాయకుని కళ్లు గిర్రుమన్నాయ్.

"నువ్వో బద్మాష్‌వని మాకు దెల్సు నడుబే !.." యస్పీ పిస్టల్ గురి.

"కాద్సార్... నేన్నిజంగా మారిపోయా..." మళ్లీ చేతులు జోడించాడు.

"అలాగని మా కళ్లలో కారం గొడ్తావ్ ! అదేం కుదర్దు. ముందు నువ్ నడువ్..." సిబ్బందికి సైగచేశాడు యస్పీ.

జోడించిన కొండయ్య చేతులకు బేడీలు తగిలించారు.

"నువ్వు అమరేందరని పేరు మార్చుకుని దేవేంద్రుడిపై పోదామనికుంటివేం... మంచోళ్లని రక్షించకుండా భక్షిస్తూంటివే... మాకు నిద్రపట్టకుండ జేస్తివి గదూ !.. లాక్కురండి !..." యస్పీ ఆదేశం.

ఓ తుపాకీ మడమ కొండయ్యని ముందుకు తోసింది.

తల్లీకూతుళ్లు గుండెలు బాదుకుంటూ మొత్తుకుంటున్నారు.

పెద్ద దళాన్ని కంట్రోల్ చేసిన కొండయ్యకి చిన్న కానిస్టేబుల్ కంట్రోల్‌లో పడక తప్పలేదు.

"మరి నన్ను స్టేషన్‌కి తీసికెళ్లి లొంగిపోయినట్లు రాస్తరుగద సార్ !.."

"ఎవ్వరినేం జెయ్యాలో మాకు బాగా దెల్సు.. కమాన్.. తప్పించుకునే ట్రై జేస్తివో తలెగిరిపోద్ది..."

ముందు ఎస్పీ. తర్వాత ఎస్సై. తుపాకుల మధ్య కొండయ్య. వెనకాల పోలీసు బలగం. ... అంతా ముందుకు కదిలారు.

తల్లీ కూతుళ్లు బాణాల్లా దూసుకొచ్చి యస్పీ కాళ్లని చుట్టేశారు.

"దొరా ! నా కొడుకు మంచోడైండు... ఇడిచి పెట్టుండ్రి దొరా !..." తల్లి హృదయం తల్లడిల్లింది.

"పొద్దుగాల్ల మా అన్ననే వస్తడు... ఇడిచిపెట్టుండ్రి సార్..." చెల్లి కన్నీళ్లతో యస్పీ బూటు తడైపోయింది.

"ఊ..." హెడ్ కానిస్టేబుల్ వైపు గుర్రుగా చూశాడు యస్పీ. ఆ గుర్రులో జరూరు ఆదేశం ఉంది.

"నీయవ్వ ! మీరడ్డం రాకుండ్రే. లెవ్వుండ్రే.." రెండు చేతుల్తో ఇద్దర్నీ చెరోపక్కకీ లాగిపారేశాడు హెడ్.

వెల్లకిలా పడిపోయారు. ఒంటిమీద గుడ్డలు గాలిపటాల్లా లేచాయ్. చెట్లనీడలు అడ్డొచ్చి వాళ్ల మానాల్ని కాశాయి. గబగబా బట్టలు సర్దుకున్నారు.

"నీ బాంచెను దొరా ! ..." లేచి ముందుకు రాబోయింది నర్సవ్వ.

"ఓసి ముసలిముండా !..." హెడ్డు రెచ్చిపోయాడు. వెనక జుట్టుపట్టుకుని ముందుకి నెట్టాడు. బోర్లాపడింది.

"అయ్యో !.. అమ్మా !.. అన్నా !.. " పద్మ గుండెలు ఎగిసిపడుతున్నాయ్.

రివ్వున ముందుకొచ్చి

"నీకు తల్లి లేదా !.. గా ముసల్దాన్ని గట్లా.." ఏదో అనబోయింది. గొంతు కీచుబోయింది.

"నీకేం రోగం పుట్టిందే పోరీ !.." జడబట్టి లాగి జబ్బలమీద చేతులేసి ముందుకు తోశాడు. దభీమని బోర్లా పడింది పద్మ. ముక్కూ, నోరూ మట్టిలో కూరుకుపోయాయి.

"సార్..." కొండయ్య నరాల్లో బండెడంత ఆవేశం.

"మావోళ్లు మిమ్మల్నేమన్నరు ? ఆళ్లేం పాపం జేసింద్రు ? ఇదన్యాయం.. అక్రమం !"

"నోర్మూయ్ బే ! ఆళ్ల జాగల ఆళ్లనుండుమను." యస్సై సలహా.

"అమ్మా !.. చెల్లే !.. ఫికర్ జేయకుంద్రి. పొద్దెక్కినంక పోలీస్‌స్టేషన్‌కి రాంద్రి. అక్కడ మాట్లాడుదాం. మరేద్వకుంద్రి..." కొండయ్య కడుపులోని ఆరాటం పైకి రాకుండా జాగ్రత్తపడడం చాలా కష్టమైపోయింది.

"నా గురించి విచారించకుంద్రి... ఆ.. గుం.. ద్రి.. ఆగుంద్రి.. జైలు నుంచొచ్చినంక మీ రుణం దీర్చుకుంట.." కొండయ్య కాళ్లు బలవంతంగా కదిలాయి. గాలితెర గబుక్కున తోసుకొచ్చింది. మేమూ సాక్ష్యం అన్నట్లు చెట్ల ఆకులు తలలూపాయి.

గుర్ర్ర్.. గుర్ర్ర్.. బర్ర్.. బర్ర్ర్... పోలీసు జీపు పొంకంగా కదిలి వేగం పుంజుకుంది.

తల్లీకూతుళ్లు ఒకరిమీద ఒకరు వాలి వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. సోలిపోయారు కాస్సేపటికి.

ఏదో చప్పుడికి మెలకువొచ్చిందిద్దరికీ.. ఎక్కడో తుపాకుల మోత.

'ఎక్కడేమైందో !... ఎప్పుడు గీ అగ్గి సల్లారుద్దో !... అనుకుంటూ ముఖాలు చూసుకున్నారిద్దరూ.

తూర్పు వాకిట్లో కాషాయకాంతులు కల్లాపి జల్లాయి. బాలభానుని నునులేతకిరణాలు ముగ్గులు పెడ్తున్నై.

ముడుచుకుపోయిన పద్మ, నీరుగారిన నర్సవ్వ బిక్కుబిక్కుమంటూ పోలీఉ స్టేషన్ కెళ్లారు.

స్టేషన్ ముందు సెంట్రీ నిల్చున్నాడు.

"కొండయ్య నా కొడుకు దొరా ! ఆణ్ణిక్కడికే తెచ్చింద్రు గదా !.." వణికే చేతులు జోడించింది నర్సవ్వ.

"వాడా !.." సెంట్రీ తుపాకి అలర్టైంది.

"వాడు నీ కొడుకా ! మంచి కొడుకునే కన్నావ్ !"

"ఔన్సారూ ! కొండయ్య నా అన్న. జర చూపించుంద్రి సారూ !.." చేతులెత్తి దణ్ణం పెట్టింది పద్మ.

సూర్యకిరణాలు తచ్చాడుతున్న ఆమె చెక్కిళ్లు అద్దాల్లా మెరుస్తున్నై. నల్లని వెంట్రుకలు

ఎర్రసి మొహం మీద తచ్చాడుతున్నై.

సెంట్రీ ఆకలిచూపులు.. నాలిక పెదాల్ని తడిపేస్తోంది.

"నా కొడుకుని చూపించుండ్రి దొరా !..."

"వీళ్లెవలయ్యా పొద్దున్నే !.. " యస్సై బైటకొచ్చాడు... అదే యస్సై..

"మేమే దొరా !... మా అన్న కొండయ్యనిక్కడికే తెచ్చింండ్రుగదా ! ఓసారి చూపించుండ్రి సారూ !.." పద్మ ముంగురులు పైకి ఎగదోసుకుంది.

"కొండయ్యనా ?.." యస్సై క్యాపు తీసి బుర్రగోక్కున్నాడు. రాత్రి నిద్ర కరువైనట్టుంది కళ్లు ఎర్రబారినై.

"ఆ... నక్సలైట్ కొండయ్యనా ?"

"ఔను దొరా !.." గుంటలుపడ్డ నర్సవ్వ కళ్లల్లో గుప్పెడాశ.

"ఇయ్యాల తెల్లారకముందే ఆడి బతుకు తెల్లారిపోయింది. ఎన్‌కౌంటర్ల ఎగిరిపోయిండు గదా ! శవం ఆ అడవిలనే ఉంది". ఠీవిగా లాఠీ ఊపుకుంటూ మరోచేత్తో క్యాపు సర్దుకుంటూ వెళ్లిపోయాడు యస్సై.

తల్లీ కూతుళ్లమీద పిడుగులు పడినై.

లోకం తలక్రిందులైంది.

**'తెలుగు పలుకు'**
**ఆస్ట్రేలియా ఆంధ్రుల అభిమాన తెలుగు పత్రిక**
**నవంబర్, 2000 లో ప్రచురితమైంది.**

